సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ

శుక్రవారం । 22 । డిసెంబర్ । 2023



108 బంగారు పుష్పాల సమర్పణ


ఆత్రేయపురం: వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి వేగుళ్ల వీర వెంకట సత్యనారాయణ చౌదరి దంపతులు 80 గ్రాముల బరువైన 108 బంగారు పుష్పాలు సమర్పించారు.



రూ.3 లక్షల విరాళం

తొండంగి: సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి సలాది సత్యనారాయణమూర్తి (పిఠాపురం) గురువారం రూ.3 లక్షల విరాళం అందజేశారు.

డెల్టా కాలువలకు నీరు విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గురువారం డెల్టా కాలువలకు 11 వేల క్యూసెక్కుల గోదావరి నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 3,400, మధ్య డెల్టాకు 1,600, పశ్చిమ డెల్టాకు 6 వేల క్యూసెక్కులు వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.90 అడుగులుగా ఉంది.

న్యూస్‌రీల్

జగన్‌తోనే విద్యా సంస్కరణలు



విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న మంత్రి విశ్వరూప్ తదితరులు

అమలాపురం టౌన్: సీఎం జగన్‌తోనే రాష్ట్రంలో విద్యా సంస్కరణలు సాధ్యమని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు గురువారం రెండో విడత 114 ట్యాబ్‌లను మంత్రి విశ్వరూప్, ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు, డీఈవో ఎం.కమలకుమారి పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈవో-1 గుబ్బల సూర్యప్రకాశం, ఎంఈవో-2 సరెళ్ల దుర్గాదేవి, ప్రధానోపాధ్యాయురాలు ఎస్.రాజరాజేశ్వరి, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు సంసాని బులినాని, జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ జిల్లా మైనార్టీ సెల్ కమిటీ నియామకం

అమలాపురం టౌన్: వైఎస్సార్ సీపీ అధినేత, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు జిల్లా మైనార్టీ సెల్ కమిటీని పార్టీ అధిష్టానం నియమించింది. జిల్లా అధ్యక్షునిగా షేక్ అబ్దుల్ ఖాదర్(అమలాపురం నియోజకవర్గం), ప్రధాన కార్యదర్శులుగా అన్వర్ తాహిర్ హుస్సేన్(పి.గన్నవరం), ఎ.అలీ హుస్సేన్ (ముమ్మిడివరం), మహ్మద్ రఫీ ఉద్దీన్(రామచంద్రపురం), రాజా హుస్సేన్(అమలాపురం), రాజే మొహిద్దీన్(రాజోలు), షేక్ ఇమ్రాన్ (మండపేట), కార్యదర్శులుగా షేక్ జాకీర్ (పి.గన్నవరం), మీర్ జవాద్ అలీ(పి.గన్నవరం), షేక్ మీరా మహ్మద్(ముమ్మిడివరం), నూర్‌బాషా మీరా సాహెబ్(ముమ్మిడివరం), అబ్దుల్ గని (రామచంద్రపురం), షేక్ దావూద్ (రామచంద్రపురం), షేక్ అలీ(అమలాపురం), ఎండీ ఖాదర్ మొహిద్దీన్(అమలాపురం), కలేషా మస్తాన్ (రాజోలు), షేక్ అన్వర్(రాజోలు), షేక్ హిమాల సాహెబ్(కొత్తపేట), షేక్ కలమి(కొత్తపేట), షేక్ మదీనా బాషా(మండపేట), హుస్సేన్(మండపేట), సంయుక్త కార్యదర్శులుగా షేక్ మొహిద్దీన్ వలీ(పి.గన్నవరం), షేక్ పీర్ సాహెబ్(పి.గన్నవరం), మీర్జా అబ్బాస్ హుస్సేన్(ముమ్మిడివరం), మహ్మద్ అబ్దుల్ కలామ్ ఆజాద్(ముమ్మిడివరం), షేక్ కాజా మొహిద్దీన్(రామచంద్రపురం), షేక్ నజీరా(రామచంద్రపురం), అన్సారీ(అమలాపురం), అమీర్ హుస్సేన్(అమలాపురం), మజహర్ ఆలీ (రాజోలు), ఫైపర్ రాజు(కొత్తపేట), యాకూబ్ (కొత్తపేట), మహ్మద్ అలీషా(మండపేట), షేక్ రెహ్మాన్(మండపేట) నియమితులయ్యారు.

సైలెన్సర్లు తీసేస్తే చర్యలు

అమలాపురం టౌన్: కొత్త సినిమా విడుదల, కోడూరుపాడులో ఆత్మీయ కలయిక కార్యక్రమాల సందర్భంగా శుక్రవారం ఎవరైనా సైలెన్సర్లు తీసేసి పెద్ద శబ్దాలతో ప్రజా జీవనానికి ఇబ్బంది కలిగిస్తే ఆ ద్విచక్ర వాహనాలను సీజ్ చేస్తామని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ ఎం.అంబికాప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సెక్షన్ 30 యాక్ట్ అమలులో ఉందని, అశ్లీల నృత్యాలు, జూద క్రీడలు వంటి చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు తావివ్వవద్దని హితవు పలికారు.

జగన్ సర్.. వన్స్ మోర్



- ఘనంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ జన్మదిన వేడుకలు
- జిల్లావ్యాప్తంగా కేకులు కట్ చేసి సంబరాలు
- విస్తృతంగా సేవా కార్యక్రమాలు
- పాల్గొన్న ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, నేతలు



అమలాపురం గడియార స్తంభం సెంటర్‌లో కేక్ కట్ చేస్తున్న మంత్రి విశ్వరూప్, ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు

సాక్షి, అమలాపురం: సంక్షేమ పథకాల సారథి.. జననేత.. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలు జిల్లాలో ఘనంగా జరిగాయి. వాడవాడలా జరిగిన జన్మదిన వేడుకల్లో జిల్లా నుంచి ప్రాతినిథ్యం వహిస్తున్న రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మున్సిపల్ చైర్‌పర్సన్లు, ఎంపీపీలు, జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, పార్టీ నాయకులు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి నివాళులర్పించిన నేతలు.. సీఎం జగన్ పుట్టిన రోజు సందర్భంగా కేకులు కట్ చేసి అభిమానులకు పంచారు. విస్తృతంగా సేవా కార్యక్రమాలు నిర్వహించారు. పలుచోట్ల రక్తదాన శిబిరాలు నిర్వహించారు. రోగులకు పాలు, పండ్లు, పేదలకు వస్త్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అభిమానులు, కార్యకర్తలు.. జగన్ జిందాబాద్, జగన్ నాయకత్వం వర్ధిల్లాలి.. జగన్ సర్.. వన్స్ మోర్' అంటూ పెద్ద పెట్టున ఉత్సాహంతో నినాదాలు చేశారు. జిల్లావ్యాప్తంగా సీఎం జగన్ పుట్టిన రోజు వేడుకలు వందలాది మంది సమక్షంలో అట్టహాసంగా జరిగాయి.

- అమలాపురం మున్సిపల్ కార్యాలయం, గడియారం స్తంభం సెంటర్, మండల పరిషత్ కార్యాలయం వద్ద జరిగిన సీఎం జగన్ జన్మదిన వేడుకల్లో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావుతో కలిసి కేక్ కట్ చేసి ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలకు పంచారు. జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. మహిళలు, దివ్యాంగులకు దుప్పట్లు పంచి పెట్టారు. ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. రోగులకు పండ్లు, బ్రెడ్లు పంచి పెట్టారు. మంత్రి విశ్వరూప్ మాట్లాడుతూ జగన్ సంక్షేమ సారథిగా నిలిచారన్నారు. ఆయన చేపట్టిన సంక్షేమ పథకాలు దేశ చరిత్రలో కొత్త అధ్యయనాన్ని సృష్టించాయన్నారు. వీటిని ఆదర్శంగా తీసుకుని ఎన్నో రాష్ట్రాలు అమలు చేస్తున్నాయన్నారు.
- రామచంద్రపురంలోని క్యాంపు కార్యాలయం వద్ద రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార, పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అభిమానులతో కలిసి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అట్టడుగు వర్గాలకు రాజ్యాధికారం ఇచ్చింది జగన్ ఒక్కరేనని అన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా, పేదరికం లేని సమాజం తీసుకురావాలనే ఉద్దేశంతో, నవరత్నాల పేరుతో వివిధ సంక్షేమ పథకాలు అమలు చేస్తూ అందరి మన్ననలూ పొందుతున్నారని అన్నారు.
- కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి ఆధ్వర్యాన నియోజకవర్గంలోని పలుచోట్ల సీఎం జగన్ జన్మదిన వేడుకలు అట్టహాసంగా జరిగాయి. రావులపాలెంలో నియోజకవర్గ స్థాయి పాస్టర్లతో కలిసి ఐక్య క్రిస్మస్, జగన్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. కేక్ కట్ చేశారు. పాస్టర్లకు ప్రెషర్ కుక్కర్లు, కేకులు పంపిణీ చేశారు.
- ముమ్మిడివరంలోని పార్టీ కార్యాలయంలో స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పొన్నాడ వెంకట సతీష్ కుమార్ ఆధ్వర్యాన కేక్ కట్ చేశారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో రోగులకు పాలు, పండ్లు పంపిణీ చేశారు.
- మండపేట రాజారత్న సెంటర్‌లో జగన్ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఆధ్వర్యాన ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు కేక్ కట్ చేసి అభిమానులకు పంచారు.
- పి.గన్నవరం నియోజకవర్గ పరిధిలోని నగరం, పి.గన్నవరం, అంబాజీపేటల్లో జరిగిన వేడుకల్లో ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు పాల్గొని కేక్ కట్ చేశారు.
- మలికిపురం మండలం కత్తిమండలోని క్యాంపు కార్యాలయం వద్ద రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు ఆధ్వర్యాన సీఎం జగన్ జన్మదిన వేడుకలు జరిగాయి. కేక్ కట్ చేసి అందరికీ పంచారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు రక్తదానం చేశారు.
- అల్లవరం మండలం గోడిలో ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ కేక్ కట్ చేసి, పేదలకు దుస్తులు పంపిణీ చేశారు.



రామచంద్రపురంలో జరిగిన సీఎం జగన్ జన్మదిన వేడుకల్లో కేక్ కట్ చేస్తున్న మంత్రి వేణుగోపాలకృష్ణ

వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనార్టీ కమిటీ నియామకం

అమలాపురం టౌన్: వైఎస్సార్ సీపీ అధినేత, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ జిల్లా క్రిస్టియన్ మైనార్టీ విభాగం కమిటీని అధిష్టానం నియమించింది. జిల్లా అధ్యక్షునిగా కనపాల బాబూరావు (రాజోలు నియోజకవర్గం), ఉపాధ్యక్షులుగా కావూరి ఫిలిప్‌రాజు (రామచంద్రపురం), లంక సీమెన్‌రాజు (పి.గన్నవరం), ప్రధాన కార్యదర్శులుగా నేలపూడి రాజు (పి.గన్నవరం), వడ్డి విజయ శామ్యూల్ జ్యోతి (ముమ్మిడివరం), కురాల సూర్యప్రకాష్ (రామచంద్రపురం), మొసలి స్పర్జన్‌రాజు (అమలాపురం), సందెపూడి ఆడమ్ (రాజోలు), ఉండ్రాసపు సుందర విజయం (కొత్తపేట), బొమ్ము చంద్రశేఖర్ (మండపేట), కార్యదర్శులుగా పెదమట రాజు (పి.గన్నవరం), మోర్త విజయరాజు (పి.గన్నవరం), అంబటి శామ్యూల్ రాజు (ముమ్మిడివరం), కాశి ఐలీషారాజు (ముమ్మిడివరం), యార్లగడ్డ శామ్యూల్‌రాజ్ (రామచంద్రపురం), సాదె వీవీ సత్యనారాయణ (రామచంద్రపురం), పల్లి జేమ్స్‌బాబు (అమలాపురం), పినిపే జయరాజు (అమలాపురం), చింతా రాంబాబు (రాజోలు), సరెళ్ల ప్రసాదరావు (రాజోలు), గెడ్డం ప్రసాద్ (కొత్తపేట), వరిగటి జెడ్సన్ బాబు (కొత్తపేట), బురదకవి జయబాబు (మండపేట), వల్లూరి సుబ్రహ్మణ్యం (మండపేట), సంయుక్త కార్యదర్శులుగా కొడమంచిలి జ్యోతిబాబు (పి.గన్నవరం), ఊబా ఈసయ్య (పి.గన్నవరం), రేవు విలియమ్స్ (ముమ్మిడివరం), పెయ్యల సువర్ణరాజు (ముమ్మిడివరం), సన్నాపు రామకృష్ణ (రామచంద్రపురం), డి.మసిల మణి (రామచంద్రపురం), భట్టు సాల్మన్‌రాజు (అమలాపురం), గోడి స్టీఫెన్‌రాజు (అమలాపురం), పోతుల దుర్గాప్రసాద్ (రాజోలు), ఇంజేటి రవి (రాజోలు), పెందుర్తి దయాకర్ (కొత్తపేట), చదకడ రాజేంద్రప్రసాద్ (కొత్తపేట), పిల్లి గోపి (మండపేట), కడియాల సాల్మన్‌రాజు (మండపేట) నియమితులయ్యారు.

జాబ్ మేళాలో 81 మందికి ఉద్యోగాలు



అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న అధికారి

అమలాపురం రూరల్: పట్టణంలోని ఉపాధి కల్పనా కార్యాలయంలో గురువారం జాబ్ మేళా నిర్వహించారు. ఉపాధి కల్పనా అధికారి ఇ.వసంతలక్ష్మి ఆధ్వర్యాన 11 ప్రైవేటు సంస్థల్లో పని చేయడానికి పదో తరగతి, ఐటీఐ, డిగ్రీ, నర్సింగ్ చదివిన స్త్రీ, పురుష అభ్యర్థులకు ఈ మేళా నిర్వహించారు. మొత్తం 316 మంది హాజరు కాగా, ఇంటర్వ్యూల అనంతరం 81 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేశారని వసంతలక్ష్మి తెలిపారు. ఎంపికైన వారికి రూ.10 వేల నుంచి రూ.30 వేల వరకూ జీతం ఇస్తారని తెలిపారు.

విజ్ఞాన వీచిక.. సృజనకు వేదిక

- నేటి నుంచి జిల్లా స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన
- రామచంద్రపురంలో పూర్తయిన ఏర్పాట్లు
- 88 ప్రాజెక్టుల ప్రదర్శన

రామచంద్రపురం: చదువు.. ఆటలే కాదు.. విభిన్న సమస్యలకు పరిష్కారాన్ని చూపించే ప్రాజెక్టుల రూపకల్పనలోనూ తాము తక్కువేమీ కాదని నిరూపించేందుకు విద్యార్థులు సన్నద్ధమవుతున్నారు. మండల స్థాయి విద్యా వైజ్ఞానిక సదస్సుల్లో సత్తా చాటిన చిన్నారులు జిల్లా స్థాయిలో కూడా తమ ప్రతిభను ప్రదర్శించేందుకు సన్నద్ధమవుతున్నారు. గతంలో కేవలం జిల్లా స్థాయిలోనే విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలు నిర్వహిస్తూండగా, గత ఏడాది నుంచి ప్రభుత్వం పాఠశాల, మండల స్థాయిల్లో కూడా వీటిని ఏర్పాటు చేసింది. పర్యావరణం, పరిశుభ్రత, మానవుని జీవన విధానం, ప్రకృతి విపత్తులకు అడ్డుకట్ట, ప్రమాదాల నివారణ, సమయం ఆదా, జీవ వనరుల సంరక్షణ – ఉపయోగం తదితర అంశాలను ఎంచుకుని నూతన ఆవిష్కరణల రూపకల్పనే ధ్యేయంగా జిల్లా స్థాయికి ఎంపికైన ప్రాజెక్టుల ప్రదర్శనకు విద్యార్థులు ఉద్యుక్తులవుతున్నారు. దీనికి రామచంద్రపురం శ్రీ కృత్తివెంటి పేర్రాజు పంతులు ప్రభుత్వ ఉన్నత పాఠశాల వేదిక కానుంది. ఇక్కడ శుక్ర, శనివారాల్లో జరిగే జిల్లా స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో జిల్లాలోని 22 మండలాల నుంచి విద్యార్థి, గ్రూపు, ఉపాధ్యాయ విభాగాలు, అటల్ ల్యాబ్ తరఫున మొత్తం 88 ప్రాజెక్టులు ప్రదర్శిస్తారు. జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్‌లో రాష్ట్ర స్థాయికి ఎంపికైన ఐదు ప్రాజెక్టులను కూడా ప్రదర్శిస్తారు. ఈ ప్రదర్శన ఏర్పాట్లను డీఈఓ ఎం.కమలకుమారి ఆధ్వర్యాన రామచంద్రపురం డీవైఈఓ శ్రీపాద లక్ష్మీనరసింహ ఫణి సారథ్యంలో జిల్లా సైన్స్ అధికారి గిరజాల వెంకట సత్య సుబ్రహ్మణ్యం నేతృత్వంలో 19 కమిటీలు పర్యవేక్షిస్తున్నాయి. జిల్లా విద్యా వైజ్ఞానిక ప్రదర్శన ప్రారంభ కార్యక్రమానికి కలెక్టర్ హిమాన్షు శుక్లా, జాయింట్ కలెక్టర్ ఎస్.నూపుర్ అజయ్, పాఠశాల విద్య రీజినల్ జాయింట్ డైరెక్టర్ జి.నాగమణి, రామచంద్రపురం ఆర్డీఓ ఏఎస్ సుధాసాగర్, మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి తదితరులు హాజరు కానున్నారు. కోనసీమ నూతన జిల్లాగా ఏర్పడిన అనంతరం తొలిసారిగా 2022-23 విద్యా సంవత్సరానికి ఈ ఏడాది ఫిబ్రవరిలో జిల్లా విద్యా, వైజ్ఞానిక ప్రదర్శన విజయంతంగా నిర్వహించారు. ప్రస్తుత విద్యా సంవత్సరానికి సంబంధించి ఈ ప్రదర్శన ఇంత త్వరగా నిర్వహించడం విద్యా శాఖ పని తీరును చెప్పకనే చెబుతోంది.

ఏర్పాట్లు పూర్తి



జిల్లా స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనకు ఏర్పాట్లు పూర్తి చేశాం. విద్యార్థుల్లోని సృజనాత్మకత ఆలోచనలకు ఇది వేదికగా నిలుస్తుంది. జిల్లా స్థాయికి ఎంపికైన ప్రతి ప్రాజెక్టునూ ఇక్కడ ప్రదర్శించేందుకు ప్రధానోపాధ్యాయులు బాధ్యత తీసుకోవాలి.

– గిరజాల వెంకట సత్య సుబ్రహ్మణ్యం, జిల్లా సైన్స్ అధికారి, అమలాపురం

ప్రతిష్టాత్మకంగా..



ఈ ప్రదర్శనను ప్రతిష్టాత్మకంగా చేపడుతున్నాం. ప్రభుత్వం విద్యాభివృద్ధికి, సైన్స్ పట్ల విద్యార్థుల్లో ఆసక్తిని పెంచేందుకు పలు కార్యక్రమాలు చేపడుతోంది. ఇందులో భాగంగా శాస్త్రీయ పరిశోధనల్లో విద్యార్థులకు ఆసక్తిని పెంచేందుకు ఏటా విద్యా, వైజ్ఞానిక ప్రదర్శనలు నిర్వహిస్తున్నాం. విద్యార్థుల్లోని మేధాసంపత్తిని వెలికి తీసేందుకు సైన్స్ కాంగ్రెస్ తప్పనిసరిగా దోహదపడుతుంది.

– ఎం.కమలకుమారి, డీఈఓ, అమలాపురం

సాధికార బస్సు యాత్రకు సర్వం సిద్ధం

- నేడు మండపేటలో నిర్వహణ
- బైక్ ర్యాలీ, బహిరంగ సభకు పూర్తయిన ఏర్పాట్లు

కపిలేశ్వరపురం: దళిత, బడుగు బలహీన వర్గాలను గత పాలకులు కేవలం ఓటు బ్యాంకుగానే చూశారు. ఎన్నికలప్పుడు పొగడ్తలు, ఎన్నికలయ్యాక పట్టించుకోకపోవడమనే వైఖరితో వ్యవహరించారు. ఇటువంటి వైఖరితో విసిగి వేసారిన వారికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెలుగుదివ్వెలా నిలిచారు. తన పాలనలో సామాజిక న్యాయానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు తన ఆత్మీయులంటూ పదే పదే చెప్పడమే కాదు.. పాలనలోనూ ఆ ప్రేమానురాగాలు చూపిస్తున్నారు. మంత్రి వర్గం నుంచి నామినేటెడ్ పదవుల వరకూ సామాజిక న్యాయాన్ని తు.చ. తప్పకుండా పాటిస్తున్నారు. ఈ నేపథ్యంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలకు సీఎం జగన్ పాలనలో చేకూరిన అభ్యున్నతిని వివరించేందుకు వైఎస్సార్ సీపీ రాష్ట్రవ్యాప్తంగా తలపెట్టిన సామాజిక సాధికార బస్సు యాత్ర శుక్రవారం మండపేటలో జరగనుంది. దీనికి ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఆధ్వర్యాన భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. సభాస్థలం, పార్కింగ్ తదితర ఏర్పాట్లను ఆయన గురువారం పరిశీలించారు. గత నెల 16న కొత్తపేటలో తొలి బస్సు యాత్ర జరగగా.. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో ఇది రెండోది.

నీలి ఆకాశం నేలకు దిగినట్టు..

నీలి ఆకాశం నేలకు దిగిందా అన్నట్టు.. బస్సు యాత్ర నేపథ్యంలో నీలం, ఆకుపచ్చ రంగులతో కూడిన వైఎస్సార్ సీపీ జెండాలతో మండపేట పట్టణంలోని వీధులు సరికొత్త కళను సంతరించుకుంది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులుకు అభినందనలు తెలుపుతూ పార్టీ శ్రేణులు ఎక్కడికక్కడ బ్యానర్లు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. బస్సు యాత్రగా వస్తున్న మంత్రులు, ప్రజాప్రతినిధులు, నేతలకు సాదర స్వాగతం పలుకుతున్నారు.



మండపేటలో ఏర్పాట్లుపై చర్చిస్తున్న ఎమ్మెల్సీ తోట

పట్టణం వైపు కదులుతున్న పల్లెలు

సామాజిక న్యాయానికి పెద్ద పీట వేసిన వైఎస్సార్ సీపీ పట్ల అభిమానాన్ని చాటుకునేందుకు నియోజకవర్గంలోని పల్లెవాసులు మండపేట పట్టణం దిశగా కదులుతున్నారు. పట్టణంతో పాటు రూరల్ మండలం, కపిలేశ్వరపురం, రాయవరం మండలాల నుంచి పెద్ద సంఖ్యలో తరలి వచ్చేందుకు సన్నద్ధమవుతున్నారు. బుధ, గురువారాల్లో గ్రామాల్లో సన్నాహక సమావేశాలు నిర్వహించుకుని తగిన ప్రణాళిక రూపొందించుకున్నారు.

యాత్ర సాగుతుందిలా..

సామాజిక సాధికార బస్సు యాత్రలో మంత్రులు పినిపే విశ్వరూప్, జోగి రమేష్, కారుమూరు వెంకట నాగేశ్వరరావు, ఎంపీలు చింతా అనురాధ, పిల్లి సుభాష్‌చంద్రబోస్, నందిగం సురేష్, మార్గాని భరత్‌రామ్, ఎమ్మెల్సీలు కుడుపూడి సూర్యనారాయణరావు, బొమ్మి ఇజ్రాయిల్, పండుల రవీంద్రబాబు పాల్గొంటున్నారు. వీరందరూ మధ్యాహ్నం 2 గంటలకు తాపేశ్వరం అతిథి ఫంక్షన్ హాలులో విలేకర్ల సమావేశంలో పాల్గొంటారు. అనంతరం సాయంత్రం 3 గంటలకు పట్టణంలోని పెద్దకాలువ వద్ద ఉన్న మహాత్మా జ్యోతిరావ్ పూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించడంతో యాత్ర ప్రారంభిస్తారు. ఈ యాత్ర పట్టణ ప్రధాన రహదారి మీదుగా సాయంత్రం 4 గంటలకు కలువపువ్వు సెంటర్‌కు చేరుతుంది. అక్కడ బహిరంగ సభ నిర్వహిస్తారు. కాకినాడ నుంచి రావులపాలెం వైపు వెళ్లే వాహనాలను బైపాస్ మీదుగా మళ్లిస్తారు. రాయవరం, మండపేట రూరల్ మండలాల నుంచి యాత్రలో పాల్గొనేందుకు వచ్చే వారిని పూలే విగ్రహం వద్ద దించుతారు. అనంతరం వాహనాలను మండపేటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపాన నిలుపుతారు. కపిలేశ్వరపురం మండలం నుంచి వాహనాల్లో వచ్చే వారిని రాజారత్న సెంటర్‌లో దించుతారు. ఆ వాహనాలు గుమ్మిలేరు రోడ్డులోని అయ్యప్ప స్వామి ఆలయ సమీపంలోని లే అవుట్ వద్ద నిలుపుతారు.

సామాజిక సాధికారతకు ప్రతీక



పేద, బడుగు బలహీన వర్గాల కుటుంబాల బ్యాంకు ఖాతాల్లో నేరుగా రూ.2.38 లక్షల కోట్ల మేర లబ్ధిని జమ చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుంది. మండపేటలో నిర్వహించే బస్సు యాత్ర ప్రభుత్వం పారదర్శకతతో అందిస్తున్న సామాజిక సాధికారతకు ప్రతీకగా నిలుస్తుంది. నియోజకవర్గ ప్రజలు నన్ను, పార్టీని ప్రేమగా ఆదరిస్తున్నారు.

– తోట త్రిమూర్తులు, ఎమ్మెల్సీ, మండపేట



అమలాపురంలో స్మార్ట్ ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ చేస్తున్న మంత్రి విశ్వరూప్

వైద్యం వేదన కాకూడదనే..

- వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పరిమితి రూ.25 లక్షలకు పెంపు
- మంత్రి పినిపే విశ్వరూప్

అమలాపురం రూరల్: వైద్యం పేరుతో పేదలు అప్పుల పాలు కాకూడదనే ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.25 లక్షలకు పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో స్మార్ట్ ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ చేశారు. ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ గతంలో ఐదు లక్షలు ఉండే ఈ పరిమితిని రాష్ట్ర ప్రభుత్వం మానవతా దృక్పథంతో రూ.25 లక్షల వరకు పెంచిందని, క్యాన్సర్‌కు పరిమితి లేదని ఆయన స్పష్టం చేశారు. ప్రతి పేద కుటుంబం ఒక ఏడాది కాలంలో రూ.25 లక్షల వరకు వైద్య సేవలు పొందవచ్చునన్నారు. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్, ఏఎన్ఎంలు సిబ్బందితో రెండు బృందాలుగా ఏర్పడి ప్రతి ఇంటికి వెళ్లి కొత్త ఫీచర్స్‌తో ఉన్న స్మార్ట్ ఆరోగ్యశ్రీ కార్డులను సరఫరా చేసి ఆరోగ్యశ్రీ యాప్‌ను దిశ యాప్ మహిళా పోలీసుల ద్వారా డౌన్లోడ్ చేయించి ఆరోగ్యశ్రీ సేవలు ఎలా పొందాలో వివరించాలని ఆయన అన్నారు. ఏడాదికి ఐదు లక్షల లోపు వార్షిక ఆదాయం పొందే అందరూ ఈ పరిధిలోనికి వస్తారన్నారు. ఆరోగ్యశ్రీ ప్రొసీజర్స్ 3257 వరకు పెంచామని, అలాగే నెట్‌వర్క్ హాస్పటల్ సంఖ్య కూడా 2,513 వరకు విస్తరించినట్టు తెలిపారు. జనవరి ఒకటి నుంచి ప్రతి గ్రామంలో ఆరు నెలలకు ఒకసారి వైద్య శిబిరాలు నిర్వహిస్తారని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పొలమూరి బాలకృష్ణ, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు బొంతు గోవిందశెట్టి, సెంట్రల్ డెల్టా బోర్డు చైర్మన్ కుడుపూడి వెంకటేశ్వర బాబు, వైద్యాధికారి వాసునాయక్, ఎంపీడీవో వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో ఏడు ఇళ్లు దగ్ధం



ఘటనాస్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

నల్లజర్ల: నల్లజర్లలో ఎస్‌ఆర్‌కే కళాశాల వెనుక ఉన్న కాలనీలో గురువారం రాత్రి 9 గంటల సమయంలో షార్ట్‌సర్క్యూట్ కారణంగా అగ్నిప్రమాదం సంభవించింది. నక్కా పండు అనే వ్యక్తి ఇంట్లో ఎగసిపడిన మంటలు, పక్కనున్న ఏడు తాటాకిళ్లకు వ్యాపించడంతో 11 కుటుంబాల వారు నిరాశ్రయులయ్యారు. సమాచారం అందుకున్న ప్రాకాశరావుపాలెంలో ఉన్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, ఇతర నాయకులు సంఘటన స్థలానికి చేరుకుని, సహాయక చర్యలు చేపట్టారు. విషయం తెలుసుకున్న కొవ్వూరు డీఎస్పీ వర్మ నల్లజర్లకు వచ్చి, సిబ్బందిని అప్రమత్తం చేశారు. సంఘటన స్థలానికి చేరకున్న మూడు అగ్నిమాపక శకటాలు మంటలను అదుపుచేశాయి. బాధితులు ఇటీవల వరదలకు ఇళ్లు కోల్పోయి, ప్రభుత్వం నుంచి సహాయం పొందిన వారే. మరలా ఈ సంఘటనతో వారు తీవ్రంగా నష్టపోయారు. ఇళ్లు కోల్పోయిన వారిలో నక్కా నాగమంగరాజు, జీవమణి, నక్కా పెదమంగరాజు, దుర్గమ్మ, లక్ష్మి, చినవెంకన్న, శ్రీను, మహాలక్ష్మి ఉన్నారు. ఎటువంటి ప్రాణనష్టం జరగలేదు. తహసీల్దార్ కిశోర్‌కుమార్ స్థానిక ఎస్‌ఆర్‌కే కళాశాలలో బాధితులకు పునరావాసం కల్పించారు.



సందిపూడిలో వెదజల్లు సాగు చేపట్టిన పొలంలో విత్తనాలు చల్లుతున్న రైతులు



పెదపట్నంలో చేపట్టిన వెదజల్లు సాగులో మొలకెత్తిన విత్తనాలు

సిరులు వెదజల్లు

- ఈ సాగుపైనే అన్నదాతల ఆసక్తి
- పెట్టుబడి ఆదాతో పాటు అధిక దిగుబడి
- డ్రమ్ సీడర్ పద్ధతితో మరింత మేలు

అలమూరు: రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమానికి అనుసరిస్తున్న పారదర్శక విధానాలతో వ్యవసాయ రంగం లాభసాటిగా సాగుతోంది. అధునాతన, పురాతన పద్ధతులను మేళవించి వ్యవసాయం చేపట్టడం ద్వారా రైతులు పెట్టుబడిని నియంత్రించుకుని అధిక దిగుబడులు సాధిస్తున్నారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో దిగుబడి ఆశాజనకంగా ఉండటంతో పాటు సరైన గిట్టుబాటు ధర లభించడంతో రైతులు రెట్టించిన ఉత్సాహంతో రబీ సాగుకు సమాయత్తమవుతున్నారు. పెరిగిన ఎరువుల ధరలు, కూలీల కొరత వల్ల పెట్టుబడిని తగ్గించుకునేందుకు ఈసారి అధికంగా రైతులు వినూత్నమైన రీతిలో వెదజల్లు సాగు చేపట్టారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో రబీ సీజన్‌కు సంబంధించి 1,58,281 ఎకరాల్లో 96,572 మంది రైతులు వరి సాగు చేపట్టారు. ఈ సీజన్‌లో సుమారు 80 శాతం మేర వెదజల్లు సాగునే ఎంచుకోగా మిగిలిన రైతులు వరినాట్లు పద్ధతిని అవలంబిస్తున్నారు. **సాగునీటి ఎద్దడి దృష్ట్యా వ్యవసాయశాఖ ఈ నెలాఖరుకు నాట్లు పూర్తి చేయాలని సూచించడంతో రైతులు తమ పనులను వేగవంతం చేశారు. సాధారణంగా రబీలో జిల్లా వాసులు వరిలో ముతక రకాలైన బొండాలు ఎక్కువగా సాగు చేయడం పరిపాటిగా మారింది. గత** ఏడాది ఎంటీయూ 3626 (బొండాలు) ధర ఆశించినంతగా లభించినా ఒకేసారి తగ్గిపోవడంతో ఈ సీజన్‌లో తక్కువ సమయానికి కోతకు వచ్చే కొత్త రకమైన ఎంటీయూ 1121 సన్నాలను రైతులు సాగు చేస్తున్నారు. వీటికి తెగుళ్లను తట్టుకుని ఎక్కువ దిగుబడి వచ్చే అవకాశం ఉంటుందని రైతుల అభిప్రాయం. వ్యవసాయ శాఖ అధికారులు కూడా వెదజల్లు సాగు వల్ల కలిగే లాభాలను వివరించడంతో రైతులు కూడా ఈవిధానాన్నే పాటించేందుకు ఎక్కువగా ఆసక్తి కనబరుస్తున్నారు. ఈ ఏడాది విత్తనాలు రైతులకు సమృద్ధిగా అందుబాటులో ఉండటంతో సమయానికి ముందే రైతులు రబీ సాగు చేపట్టగా అందులో అధిక భాగం వెదజల్లు సాగు వైపు మొగ్గు చూపుతున్నారు.

కలుపు యాజమాన్య పద్ధతి

రబీపంట తొలిదశలో నీరు నిలగట్టక ఆరుతడిగా **సాగు చేయడం వల్ల కలుపు సమస్య అధికంగా ఉంటుంది. అందు వల్ల ఈ పద్ధతిలో కలుపు మందును తప్పనిసరిగా వాడాలి. ఒక ఎకరాకు 35 గ్రాముల ఆక్సాడయార్జిల్ లేదా ప్రెటిలాక్లోర్ మందును ఎకరాకు 400 మి.లీ లేదా పైరజో సల్ఫ్యూరాన్ ఇథైల్ 100 గ్రాముల మందును 20 కిలోల పొడి ఇసుకలో** కలపాలి. ఈ మందును వెదజల్లు విధానంలో విత్తిన 3-5 రోజుల్లో పొలంలో పలుచగా నీరు పెట్టి కలుపు మందును పిచికారీ చేయాలి. ఆ తరువాత పొలంలో నీరు తీసి వేయడం ద్వారా కలుపును నివారించవచ్చు. రెండో దశ నుంచి పొలంలో ఏర్పడిన కలుపును మొక్కల మధ్య తొక్కడం ద్వారా ఎరువుగా మలచుకోవచ్చు.

నీటి యాజమాన్య పద్ధతి

విత్తనం వేసినప్పటి నుంచి పొట్ట దశ వచ్చే వరకూ పొలంలో నీరు నిల్వ ఉండకుండా కేవలం బురదగా మాత్రమే ఉండేలా చర్యలు తీసుకోవాలి. ఎక్కువైన నీటిని బయటకు పోవడానికి వీలుగా కాలువలు ఏర్పాటు చేసుకోవాలి. దీనివల్ల వరి కంకి వేర్లు ఆరోగ్యవంతంగా పెరిగి ఎక్కువ పిలకలు పెట్టే అవకాశం ఉంటుంది. పైరు పొట్ట దశ నుంచి పంట కోసే పది రోజుల ముందు రెండు సెంటీ మీటర్ల నీరు నిల్వ ఉండేలా చూసుకోవాలి.

వెదజల్లు సాగుతో ఉపయోగాలు

- **తక్కువ సమయంలో** ఎక్కువ విస్తీర్ణంలో **సాగు చేసి కూలీల** కొరతను అధిగమించవచ్చు.
- **సాగునీటి ఎద్దడిని** అధిగమిస్తుంది. పం**ట పది రోజుల ము**ందే కోతకు వస్తుంది. **భూమి సారవంతం**గా మారుతుంది.
- **మొక్కలో సాంద్రత** పెరిగి పది శాతం **మేర అధిక దిగుబ**డికి అవకాశం ఏర్పడు**తుంది.**
- **సాధారణ పద్ధతిలో** వరిసాగు చేయాలంటే ఎకరం పొలంలో వరిసాగుకు వరి నారుమడికి 30 కేజీల విత్తనాలు అవసరమవుతాయి.
- అదే వెదజల్లు పద్ధతిలో కేవలం 12 నుంచి 18 కేజీల వరి విత్తనాలు మాత్రమే అవసరమవుతాయి.
- కలుపు మొక్కలను సస్యరక్షణ చర్యలు చేపట్టడం ద్వారా ఎరువుగా మలచుకోవచ్చు.
- నారుమడులు పోసి ఊడ్చేందుకు పట్టే ఎక్కువ సమయాన్ని వెదసాగుతో అరికట్టవచ్చు.
- దీనివల్ల పెట్టుబడి సుమారు రూ.మూడు వేల వరకూ ఆదా అవుతుంది.
- ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో పంట కాలం కోల్పోకుండా నీరు అందుబాటులో ఉన్నప్పుడే వరిసాగు చేసుకునే అవకాశం ఉంటుంది.

కనీస జాగ్రత్తలు పాటించాలి



వెదజల్లు విధానంలో సాగు చేసే రైతులు విత్తనాలను 24 గంటల పాటు నానబెట్టాలి. మరుసటి రోజు ఆ విత్తనాలను గోనె సంచె కప్పి నిల్వ ఉంచాలి. విత్తనం ముక్కు పగిలి తెల్లగా మోసు వచ్చే క్రమంలో పొలంలో విత్తనాలను వెదజల్లాలి. విత్తనాలకు మొక్కలు వచ్చే వరకూ పొలంలో నీరు లేకుండా కాలువలు ఏర్పాటు చేసుకుని బయటకు పంపాలి. వారం రోజుల తరువాత ఒకసారి పంటకు సాగునీటిని అందజేసి మరుసటి రోజు తొలగించాలి. దమ్ము చేసే సమయంలో పొలంలో ఎగుడు దిగుడులు లేకుండా నేలను సమాంతరంగా ఉండేలా చర్యలు తీసుకోవాలి. ఎకరానికి 16 నుంచి 20 కిలోల విత్తనాలను నాటాలి. వరినాట్లు నాటే 15 రోజుల మందు ఒకసారి చేనుకు దమ్ము చేయాలి. నాలుగు రోజులు ముందుగా చదును చేయాలి. ప్రతి రెండు మీటర్లకు 20 సెంటీ మీటర్ల కాలువలను ఏర్పాటు చేయాలి. కలుపు నివారణకు బింతియోకార్బ్ లేదా అనిలోఫాస్ 1.25 లీటర్ల మందును 27 కిలోల ఇసుకలో కలిపి చల్లితే కలుపును నివారించవచ్చు. వెదజల్లు సాగు విధానంలో కనీస జాగ్రత్తలు పాటిస్తే మంచి

– బోసుబాబు, జిల్లా వ్యవసాయాధికారి

డ్రమ్ సీడర్ పద్ధతిలో..

దమ్ము చేసిన అనంతరం చదును చేసిన భూమిలో పలచటి నీటి పొర ఉండేలా చూసుకుని మడి కట్టిన విత్తనాన్ని చల్లాలి. డ్రమ్ సీడర్ పరికరానికి నాలుగు ప్లాస్టిక్ డ్రమ్ములు ఉంటాయి. ప్రతి డ్రమ్ముకు 20 సెంటీ మీటర్ల దూరంలో రెండు చివర్ల వరుసకు 18 రంధ్రాలుంటాయి. ఈ డ్రమ్ములో మొలకెత్తిన విత్తనాలను నింపి మూతను బిగించాలి. గింజలు నింపిన డ్రమ్ సీడర్‌ను లాగితే ఎనిమిది వరుసల్లో 20 సెంటీ మీటర్ల దూరంలో గింజలు పడతాయి. దీంతో వరుసల్లో కుదురు కుదురుకు మధ్య దూరం 5 నుంచి 8 సెంటీ మీటర్ల దూరం ఉంటుంది. ప్రతి 16 వరుసలకు అడుగు వెడల్పులో కాలిబాటలు వేసుకోవాలి. తాడు లాగి డ్రమ్ వాడితే వరుసలు బాగా వచ్చి విత్తు సక్రమంగా జరుగుతుంది.

పేదలకు వరం జగనన్న పాలన

జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు

కాకినాడ సిటీ: ప్రభుత్వ సేవలను పారదర్శకంగా అందించేందుకు సంక్షేమ పథకాలను పేదల చెంతకు చేర్చిన మహోన్నత వ్యక్తిగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చరిత్రలో నిలిచిపోతారని జిల్లా పరిషత్ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు అన్నారు. గురువారం జెడ్పీ సమావేశపు మందిరంలో జెడ్పీ ఉద్యోగులతో కలిసి ఏర్పాటు చేసిన సీఎం జగన్ పుట్టిన రోజు వేడుకను ఘనంగా నిర్వహించారు. మహాత్ముడు కలలు కన్న గ్రామ స్వరాజ్యాన్ని ఆవిష్కరించడంలో జగన్ కృషి అభినందనీయమన్నారు. గతంలో అర్హత ఉన్నా ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందాలంటే ప్రభుత్వ కార్యాలయాలు, రాజకీయ నాయకుల చుట్టూ కాళ్లరిగేలా ప్రదక్షిణ చేయాల్సిన దుస్థితి ఉండేదని, నాయకుల సిఫార్సులు ఉంటేనే లబ్ధిదారుల జాబితాలో పేరు ఉండేదన్నారు. జగన్ నాయకత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి, అక్రమాలకు చరమగీతం పాడుతూ సచివాలయ వ్యవస్థ ద్వారా పాలనను ప్రజల చెంతకు చేర్చిందన్నారు. దేశంలో అనేక రాష్ట్రాలు ఆంధ్రప్రదేశ్‌లో అమలవుతున్న సంక్షేమ పథకాలను ఆదర్శంగా తీసుకుంటున్నాయన్నారు. వచ్చే ఎన్నికల్లో మళ్లీ జగన్ సీఎం అవుతారని ఆయన జోస్యం చెప్పారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన భారీ కేక్‌ను వేణుగోపాలరావు జెడ్పీ ఉద్యోగులతో కలసి కట్ చేసి పంచారు. ఏపీ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ఆర్‌వీవీ రమేష్, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కాందూరి శ్రీనివాసరావు, జెడ్పీ కార్యాలయపు పరిపాలనాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



జెడ్పీ కార్యాలయంలో సీఎం జగన్ పుట్టిన రోజు కేక్‌ను కట్ చేసి పంచుతున్న చైర్మన్ వేణుగోపాలరావు

24న రాష్ట్రస్థాయి క్రాస్ కంట్రీ పోటీలు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): జిల్లా అథ్లెటిక్స్ సంఘం ఆధ్వర్యంలో ఈనెల 24న రాష్ట్రస్థాయి క్రాస్ కంట్రీ పోటీలు నిర్వహిస్తున్నట్లు సంఘ కార్యదర్శి కె.సుబ్రహ్మణ్యం గురువారం తెలిపారు. సామర్లకోట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ పోటీలు జరుగుతాయన్నారు. 10 కిలోమీటర్ల పురుషులు, మహిళలు, 8 కిలో మీటర్ల అండర్-20 బాలురు, బాలికలు, అండర్-20 బాలికలకు 6 కిలోమీటర్లు, అండర్-18 బాలురకు 6 కిలోమీటర్లు, బాలికలకు 4 కిలోమీటర్ల, అండర్-16 బాలురు, బాలికలకు 2 కిలోమీటర్ల పరుగు నిర్వహిస్తామన్నారు. ఈ పోటీలకు ఎంపికైన జిల్లా క్రీడాకారులు శనివారంలోపు తమ ఆధార్ కార్డు, జనన ధ్రువీకరణ పత్రాలతో సంఘ కోశాధికారి వర్మకు రిపోర్టు చేయాలని కోరారు.

వాటిని జాతీయ రహదారులుగా మార్చండి



ప్రధాన మంత్రి నరేంద్రమోదీని మార్యాదపూర్వకంగా కలసిన ఎంపీ వంగా గీత

కాకినాడ సిటీ: జిల్లాలోని ముఖ్యమైన మూడు రాష్ట్ర రహదారులను జాతీయ రహదారులుగా మార్చేందుకు ఆదేశాలు ఇవ్వాలని ఎంపీ వంగా గీత ప్రధాని నరేంద్రమోదీని కోరారు. గురువారం ఆమె ప్రధానిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కాకినాడ పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధిపై చర్చించారు. ఈ సందర్భంగా ముఖ్యమైన రాష్ట్ర రహదారులను జాతీయ రహదారులుగా మార్చే విధంగా ఆదేశాలు జారీ చేయాలని కోరినట్లు ఎంపీ గీత వివరించారు. కాకినాడ నుంచి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం వయా రామచంద్రపురం మీదుగా, కాకినాడ నుంచి జొన్నాడ వయా రామచంద్రపురం మీదుగా, కాకినాడ నుంచి తూర్పుగోదావరి జిల్లా వయా సామర్లకోట కెనాల్ రోడ్లు ఈ మూడు రహదారులు అత్యంత ముఖ్యమైన పుణ్యక్షేత్రాలైన పంచారామ క్షేత్రం, అష్టాదశ శక్తి పీఠం, గయా క్షేత్రం, దత్త క్షేత్రాలను కలుపుతూ వర్తక, వాణిజ్యపరంగా మూడు జిల్లాలను కలుపుతున్న ప్రధాన రాష్ట్ర రహదారులను జాతీయ రహదారులుగా మార్చాలని కోరారు. గతంలో కేంద్ర రాష్ట్ర రహదారుల శాఖామాత్యులు నితిన్ గట్కారికి ప్రతిపాదనలు సమర్పించినట్టు ఆమె తెలిపారు. ఈ ప్రతిపాదనలపై మంత్రి స్పందించి కేంద్ర రాష్ట్ర రహదారుల శాఖ అధికారులకు ప్రతిపాదనలకు సంబంధించి నివేదిక తయారు చేయాలని ఆదేశాలు ఇచ్చినట్లు ఎంపీ గీత వివరించారు. పార్లమెంటు సమావేశాల సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్రమోడీని కలసి రాష్ట్ర రహదారులు మూడు జాతీయ రహదారులుగా మార్చే విధంగా ఆదేశాలు జారీ చేయాలని కోరినట్లు ఎంపీ వంగా గీత వివరించారు.

కష్టపడ్డారు.. ఎస్సై పోస్టు కొట్టారు

- కాకినాడ జిల్లా నుంచి ఇద్దరు..
- కోనసీమ నుంచి ముగ్గురు

పెద్దాపురం/ప్రత్తిపాడు రూరల్/కాట్రేనికోన/ఉప్పలగుప్తం : ఖాకీ డ్రెస్ అంటే ఓ గౌరవం. అది ధరిస్తే ఒక హుందాతనం. ఎంతో మంది యువత దీనిని సాధించడం. బుధవారం రాత్రి విడుదలైన ఎస్సై పరీక్ష ఫలితాల్లో మంచి ఉత్తీర్ణత సాధించారు. కాకినాడ జిల్లా పెద్దాపురం మండలం సత్తిరెడ్డిపేటకు చెందిన కొరిపూరి సూర్యప్రకాష్, ప్రత్తిపాడు రూరల్ మండలం ధర్మవరానికి చెందిన రెడ్డిపల్లి శ్రీధర్ బాబు, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జిల్లా కాట్రేనికోన మండలం బలుసుతిప్ప గ్రామానికి చెందిన తిరుమాని లోకేశ్వరి, రామాడి కవిత, ఉప్పలగుప్తం మండలం ఎస్.కొత్తపల్లికి చెందిన కుంచే శ్రీలత ఈ ఘనత సాధించారు. సూర్యప్రకాష్ 2018లో ఇంజినీరింగ్ పూర్తి చేసినా ఎస్సై ఉద్యోగంపై ఇష్టంతో కష్టపడి ఈ ఘనత సాధించాడు. అతని తండ్రి శ్రీను గోకవరం ఆర్టీసీ డిపోలో కండక్టర్ కాగా, తల్లి సత్యవతి గృహిణి. అక్టోబర్ 14, 15 తేదీల్లో నిర్వహించిన ఎస్‌ఐ పరీక్షల్లో ఎంపికయ్యాడు. అలాగే శ్రీధర్ బాబు వ్యవసాయ నేపథ్యం కలిగిన రెడ్డిపల్లి సత్యనారాయణ, రాఘవమ్మ దంపతుల కుమారుడు. ఇద్దరు కుమారుల్లో పెద్దవాడైన ఆయన తొలుత 2013లో కానిస్టేబుల్ ఉద్యోగాన్ని సాధించి అమలాపురంలో కానిస్టేబుల్‌గా పనిచేస్తూ ఎస్సై పరీక్షల్లో ఉత్తీర్ణుడయ్యారు. ఇక లోకేశ్వరి తిరుమాని సత్యానందం కుమార్తె. 7వ తరగతి వరకు ఎంపీపీయూపీ బలుసుతిప్ప, 8 నుంచి పదో తరగతి వరకు కందికుప్ప హైస్కూల్లో చదువుకుంది. తన కుటుంబ ఆర్థిక స్తోమత బాగులేకపోవడంతో మేనత్త కాలాడి వీరవేణి ఇంటి వద్ద ఉంటూ కాకినాడలో గాయత్రి జూనియర్ కాలేజీలో ఇంటర్, ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో బీఎస్సీ చదివింది. శ్యామ్ ఇన్స్టిట్యూట్‌లో శిక్షణ పొంది మొదటి బ్యాచ్‌లోనే ఎస్సైగా ఎంపికైంది. ఈ విజయం తన అత్తమ్మకే అంకితమని ఆమె గర్వంగా చెప్పారు. ఇదే గ్రామానికి చెందిన కవిత రామాడి కోటేశ్వరరావు, లక్ష్మి దంపతుల పెద్ద కుమార్తె. తండ్రి 1996 తుఫానులో మృతి చెందగా పిల్లలతో పాటు తల్లి కాకినాడ వెళ్లిపోయారు. కవిత భర్త కాకినాడ జిల్లా పోలీసు కార్యాలయంలో కానిస్టేబుల్. ఆమె పదో తరగతి వరకు సెయింట్ అన్స్ స్కూల్, ఇంటర్ నారాయణ జూనియర్ కళాశాల, ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ పూర్తి చేశారు. అలాగే శ్రీలత ఎస్.కొత్తపల్లి సర్పంచ్ కుంచే చిట్టికుమారి, చిన్ని దంపతుల కుమార్తె. ఆమె స్థానిక సచివాలయం-2 పరిధిలో మహిళా పోలీసుగా విధులు నిర్వహిస్తున్నారు. వీరందరి విజయాలపై ఆయా గ్రామాల్లో అభినందనలు వెల్లువెత్తాయి.



శ్రీధర్ బాబు



తిరుమాని లోకేశ్వరి



రామాడి కవిత



తల్లిదండ్రులతో కుంచే శ్రీలత



సూర్య ప్రకాష్‌కు స్వీట్లు తినిపిస్తున్న తల్లిదండ్రులు

నీటి ట్యాంకులో పడి ఇద్దరు చిన్నారుల దుర్మరణం

రాజానగరం: అభం శుభం తెలియని ఇద్దరు చిన్నారులు నీటి ట్యాంకులో పడి దుర్మరణం చెందిన విషాద ఘటన తూర్పు గోదావరి జిల్లా రాజానగరం మండలం చక్రద్వారబంధం గ్రామంలో గురువారం జరిగింది. ఈ సంఘటనలో గట్టిం వినిత (4), కమ్మిల జస్వంత్ (4) మృత్యువాత పడ్డారు. గ్రామానికి చెందిన గట్టిం శ్రీనివాస్, దేవి దంపతులు, కమ్మిల రాము, గణేశ్వరి దంపతులు పక్కపక్కనే ఉన్న ఇళ్లల్లో నివసిస్తున్నారు. శ్రీనివాస్ దంపతులకు వినిత పెద్ద కుమార్తె. ఆమె తరువాత ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. రాము దంపతులకు జస్వంత్‌తో పాటు ఒక కుమార్తె కూడా ఉంది. వినిత, జస్వంత్ నర్సరీ చదువుతున్నారు. కాన్వెంట్‌కు వెళ్లి వచ్చిన తరువాత వీరిద్దరూ సాయంత్రం వినిత్ ఇంటి పైన ఉన్న వాటర్ ట్యాంకుకు ఉన్న నిచ్చెన ఎక్కి, ప్రమాదవశాత్తూ ఆ ట్యాంకులో పడిపోయారు. పిల్లలిద్దరూ చాలాసేపు కనిపించకపోవడంతో వారి తల్లిదండ్రులు వారి కోసం వెతికారు. చివరకు వాటర్ ట్యాంకులో చూడగా చిన్నారులిద్దరూ విగతజీవులై ట్యాంకులో తేలుతూ కనిపించారు. వెంటనే వారిని ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు చెప్పారు. కళ్ల ముందు ఆడుతూ పాడుతూ చలాకీగా తిరిగే పిల్లల జీవితం విషాదాంతం కావడంతో ఇద్దరు చిన్నారుల తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. చిన్నారి వినిత తండ్రి శ్రీనివాస్ వాటర్ ట్రాక్టర్లపై ట్యాంకర్లు విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నేపథ్యంలోనే తన ఇంటి వాటర్ ట్యాంకుకు నిచ్చెన ఏర్పాటు చేసుకున్నాడు. ఆ నిచ్చెనే పిల్లల ఉసురు తీస్తుందనుకోలేదంటూ అతడి కుటుంబ సభ్యులు విలపిస్తున్నారు. మరో మృతుడు జస్వంత్ తండ్రి రాము వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కొడుకు బాగా చదువుకుని వృద్ధిలోకి వస్తాడనుకున్నామని, ఇంతలోనే తమ బిడ్డ జీవితం అర్థాంతరంగా ముగిసిపోయిందని వారు రోదిస్తున్నారు.



జస్వంత్ (ఫైల్)

ఘర్షణల్లో 12 మంది కేసు నమోదు

కొవ్వూరు: దొమ్మేరులో బుధవారం జరిగిన వివాహ విందులో పలువురి మధ్య ఘర్షణ చోటుచేసుకోవడంతో వేర్వేరు ఫిర్యాదులపై 12 మందిపై కేసు నమోదు చేశారు. ఈ విందులో జరిగిన గొడవపై అడిగినందుకు వెళ్తే తనను కొట్టారని చిన్నం రాంబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నలుగురిపై కేసు నమోదు చేసినట్టు పట్టణ ఎస్సై బి.దుర్గాప్రసాద్ తెలిపారు. రాంబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అదే గ్రామానికి చెందిన యాళ్ల నరేంద్ర, యాళ్ల దివ్యతేజ, బొంత రాజు, యాళ్ల జ్ఞానతేజపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

ఇలా ఉంటే మరో కేసులో యాళ్ల జ్ఞానతేజ తన ఇంటికి వచ్చి కొట్టినట్టు ఇచ్చిన ఫిర్యాదు మేరకు చిన్నం సుధీర్‌తో పాటు ఎనిమిది మందిపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై దుర్గాప్రసాద్ తెలిపారు. చిన్నం వెంకటరత్నం, చిన్నం సొదామని, చిన్నం పండు, చిన్నం సుధీర్‌తో పాటు మరో నలుగురిపైన కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

బుధవారం గ్రామానికి చెందిన చిన్నం హరిబాబు సోదరుడు రాజశేఖర్ వివాహ విందులో ఈ ఘర్షణలు చోటు చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.